ఫిర్యాదు బాక్స్‌లో సమస్యపై కదిలిన యంత్రాంగం



విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

లింగపాలెం : ధర్మాజీగూడెం భట్రాజులపేట ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ మార్పాలని విద్యార్థులు పాఠశాలలోని ఫిర్యాదు బాక్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించింది. ఎంపీడీఓ ఆశీర్వాదం, ఎంఈఓ కె రామారావు అకస్మికంగా పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం తప్పనిసరిగా కూరలు తయారుచేయాలని వంట ఏజెన్సి వారికి సూచించారు. విద్యార్థుల మెనూ మార్పు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఎంపీడీఓ తెలిపారు. సీఆర్పీ జి కుమార్ మంగళం, సచివాలయ మహిళా కానిస్టేబుల్ కృష్ణవేణి, హెచ్ఎం వెంకటప్పయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజు త్వరగా కోలుకోవాలని..



బుట్టాయగూడెంలో ఎమ్మెల్యే కోలుకోవాలని కోరుతూ అక్షరమాల రూపంలో ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులు



జీలుగుమిల్లి జగదాంబ గుడి వద్ద పూజల అనంతరం మాట్లాడుతున్న నాయకులు



ఎమ్మెల్యే బాలరాజును పరామర్శిస్తున్న ఆళ్లనాని, తదితరులు

బుట్టాయగూడెం : ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంపూర్ణంగా కోలుకోవాలని కోరుతూ జీలుగుమిల్లి జగదాంబ అమ్మవారి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు చందా ప్రసాద్, ఎంపీటీసీ సున్నం సురేష్, నాయకులు కక్కిరాల చక్రి, రాము, చిట్టిబొమ్మ శ్రీను, వనమా రామకృష్ణ, కొప్పుల రాంపండు, బొంతు రామకృష్ణ, కొప్పుల బాలు, సర్పంచ్ సున్నం వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిమానం

అస్వస్థతకు గురై వైద్యం పొందుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు త్వరగా కోలుకోవాలని కోరుతూ స్థానిక డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, జూనియర్ కళాశాల విద్యార్థినులు 'ఎమ్మెల్యే సర్ గెట్ వెల్‌సూన్' అని అక్షరమాల రూపంలో కూర్చుని ఎమ్మెల్యే బాలరాజు పట్ల వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్, కళాశాల అధ్యాపకులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు సయ్యద్‌బాజీ, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, సరియం లక్ష్మి, తాటి సీత, బన్నే బుచ్చిరాజు, మాల్పి వెంకన్నబాబు, పార్టీ నాయకులు మొడియం మంగారావు, చల్లయ్య, గంటసాల గాంధీ, గణేష్, బద్రి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజుకు ఆళ్ల నాని పరామర్శ

బుట్టాయగూడెం : రాజమండ్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని పరామర్శించారు. ఆరోగ్యం కుదుటపడే వరకూ తగిన విశ్రాంతి తీసుకోవాలని బాలరాజుకు నాని సూచించారు. అదేవిధంగా వైద్యులు విజయ్ కుమార్‌తో మాట్లాడి బాలరాజు ఆరోగ్య స్థితి, ఆయనకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే స్వరాజ్ కూడా ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించి ఆరోగ్యస్థితిపై అడిగి తెలుసుకున్నారు.

ఆయిల్‌పామ్ సాగులో ఏపీ అగ్రస్థానం



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు

కామవరపుకోట : దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆయిల్‌పామ్ సాగులో అగ్రస్థానంలో ఉందని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఆడమిల్లి గ్రామంలో గోద్రెజ్ ఆయిల్ కంపెనీ నూతనంగా నిర్మించిన పామాయిల్ సాగుకు కావలసిన 'సమాధాన్' మార్ట్‌ను ఎంపీ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆయిల్‌పామ్ గెల ధర టన్ను సుమారు రూ.7 వేలు ఉండేదని, దీంతో గిట్టుబాటు ధర లభించక అప్పులపాలైన రైతులు ఆయిల్‌పామ్ తోటలు తొలగించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇప్పుడు టన్ను ఆయిల్‌పామ్ గెల ధర రూ.22 వేలు పైబడి ఉందన్నారు. దీంతో ఉత్సాహంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు ఇస్తుండడంతో రాష్ట్రంలో 2 లక్షల 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, ఆడమిల్లి గ్రామ సర్పంచ్ కేశవరావు, ఎంపీటీసీ సాయిబాబా, చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, చింతలపూడి జెడ్పీటీసీ నీరజ, గోద్రెజ్ సంస్థ సీఈఓ ఎస్.నియోగి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



పోలవరంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీవో ఝాన్సీరాణి తదితరులు



ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు



బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు

పోలవరం రూరల్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం పోలవరంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీ రాణి మాట్లాడుతూ 18 సంవత్సరాల యువతీ యువకులు అందరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస బాబు, ఎంఈవో ఎస్.స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.స్లీవజోజి మాట్లాడుతూ ఓటును అమ్ముకోవడానికి కాకుండా మంచి పాలకులను నిర్దేశించుకునేలా ప్రజలు, యువత కృషిచేయాలన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లు ఎస్.రాధాకృష్ణమూర్తి, కె.రామచంద్రరావు, బి.సత్యనారాయణ, కె.త్రినాధరావులను తహసీల్దార్ ఘనంగా సన్మానించారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

చింతలపూడి : ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కష్ణజ్యోతి మాట్లాడుతూ ఓటు హక్కు విలువపై ప్రజల్లో అవగాహన కలిగించాలని అన్నారు. ముగ్గురు సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సరిపల్లి పోలింగ్ కేంద్రాల్లో సీనియర్ సిటిజన్లకు, ఓటర్లకు సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. వీఆర్వో, బూత్ లెవెల్ ఆఫీసర్ అడపా రాంబాబు ఆధ్వర్యంలో ఇప్పటివరకు అత్యధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న పౌరులకు సన్మానం చేశారు. సర్పంచ్ తాడేపల్లి కృష్ణ (గోపి), వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మండపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి

లింగపాలెం : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలం నుంచి లింగపాలెం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. వ్యాసరచన, ఉపన్యాసం పోటీల్లో విజేతలకు తహసీల్దార్ మురళీకృష్ణ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. భోగోలులో సీనియర్ సిటిజన్ ఇనుగంటి నవనేతంను సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, వైఎస్సార్ సీపీ నేత ఇ సతీష్, సత్కరించారు.

ఓటు.. సామాన్యుని చేతిలో బ్రహ్మాస్త్రం

ద్వారకాతిరుమల : ప్రజాస్వామ్యంలో సామాన్యుని చేతిలో ఉన్న ఒకే ఒక్క బ్రహ్మాస్త్రం ఓటు హక్కు అని తహసీల్దార్ సుందర్‌సింగ్ అన్నారు. స్థానిక శ్రీశ్రీనివాసా కళాశాల ఆవరణలో విద్యార్థులకు బుధవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఎంపీడీవో ఏవీ సుబ్బారాయన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం

వేలేరుపాడు : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని వేలేరుపాడు తహసీల్దార్ కుంజా చల్లన్నదొర పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా హైస్కూల్ నుంచి వేలేరుపాడు వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము సర్పంచ్‌లు సోడే వెంకమ్మ, కట్టి ఉదయ్‌కిరణ్, సీనియర్ అస్టెంట్ శ్రీనివాస భుజంగం, వీఆర్‌ఓ షేక్.షకీలా, ముత్యాలరావు, హెచ్‌ఎం పైదా రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో బుధవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేశారు. తహసీల్దార్ ఎస్.శారాశాంతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంపొందించడమే జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, దానిని ఓటర్లు సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.

ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నతానియల్, రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు.



జంగారెడ్డిగూడెంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



వేలేరుపాడు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ చల్లన్నదొర



చింతలపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రికార్డులు చూపి వాహనాలు తీసుకెళ్లాలి

ద్వారకాతిరుమల : మండలంలోని గుణ్ణంపల్లి పరిధిలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తుల 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. సంబంధిత వాహనాల రికార్డులను యజమానులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చూపి, వాటిని తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర పురస్కారంతో మరింత బాధ్యత



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వినయ్‌రామ్

కొయ్యలగూడెం: ఉపరితల రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా పురస్కారం అందుకోవటంతో తన బాధ్యతను మరింత పెంచిందని కొయ్యలగూడెంకు చెందిన నిడదవోలు వినయ్‌రామ్ అన్నారు. మోస్ట్ ఇన్‌స్పైరింగ్ గ్రీన్ ఎంట్రిప్రెన్యూర్ రంగంలో విశేష సేవలు అందించినందుకు కేంద్రం ప్రభుత్వ పురస్కారానికి ఎంపికయ్యాయని, ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు వినయ్ రామ్ స్థానిక విలేకరులకు తెలిపారు. తన ప్రాజెక్టు విధానాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారని, ప్రస్తుతానికి రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఈ విధానాలను ఆయనకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని, కేంద్రం తరఫున సహకారం అందజేస్తామని మంత్రి పేర్కొన్నట్లు వినయ్ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసునమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన చల్లా తేజశ్రీకి, గుంటూరుజిల్లా గోరంట్లకు చెందిన ఉదయ్‌కిరణ్‌కు 2019లో వివాహమైంది. ఈ సమయంలో తేజశ్రీ తల్లిదండ్రులు రూ.5 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఉదయ్‌కిరణ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికావడంతో తేజశ్రీ తన భర్తతో రెండేళ్లపాటు అమెరికాలో ఉన్నారు. అనంతరం 2021లో అత్తగారింటి వద్దకు వచ్చారు. అయితే అప్పటినుంచి అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో తేజశ్రీ ఆత్మహత్యయత్నం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మెట్టినింటివారు ఆమెను విజయవాడ బస్టాండ్‌లో వదిలివేయడంతో తేజశ్రీ తల్లిదండ్రులు ఆమెను తమతోపాటు తీసుకువెళ్లారు. కాగా తన భర్తకు తొలుత వివాహమైన విషయం దాచిపెట్టి తనను, తన కుటుంబసభ్యులను మోసం చేసి వివాహం చేసుకోవడమే కాకుండా అదనపు కట్నం కోసం వేధింపునకు గురిచేస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని తేజశ్రీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటినుంచి పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం

జంగారెడ్డిగూడెం : ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016ను అనుసరించి జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలో గురువారం నుంచి ప్లాస్టిక్ కవర్లు, బ్యానర్లు వాడకాన్ని నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకారం 120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ స్టిక్‌తో కూడిన ఇయర్ బడ్స్, పాల కవర్లు, ప్లాస్టిక్ జెండాలు, బెలూన్ల కోసం ప్లాస్టిక్ స్టిక్‌లు, ఐస్ క్రీం స్టిక్‌లు మొదలైన వాటి తయారీ, దిగుమతి, నిల్వలు, అమ్మకం, నిర్దిష్ట సింగిల్ యూజ్‌లను, ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ఉపయోగించడం నిషేధించినట్లు తెలిపారు. సదరు ఫ్లెక్సీలకు చదరపు అడుగునకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

మాదిగ మాస్టీలను ప్రభుత్వం ఆదుకోవాలి



రాజవరంలో మాదిగ మాస్టీలను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : మాదిగ మాస్టీలను ప్రభుత్వం ఆదుకోవాలని రాజవరం సర్పంచ్, సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో రెండు రోజులుగా మాదిగ మాస్టీలు నిర్వహిస్తున్న ప్రదర్శన ముగిసిన సందర్భంగా సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తుక్కయ్య మాట్లాడుతూ పొట్టకూటి కోసం ప్రాణాంతకమైన విన్యాసాలను చేస్తూ మాదిగ మాస్టీలు నిత్యం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘ పెద్దకు సన్మానం నిర్వహించి అరకాసు బంగారం, రూ.10 వేలు రొక్కం అందజేశారు. ఎంపీటీసీ తమిర్చి బ్రహ్మయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, భీమడోలు వెంకట్రావు, తమిర్చి శ్రీను, రేలంగి రాజు, ఏడిదల యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లింగపాలెం మండల సచివాలయాల కన్వీనర్‌గా శాంతారావు



ఎమ్మెల్యే ఎలీజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాంతారావు

లింగపాలెం : గ్రామ సచివాలయాల కన్వీనర్లు పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. రాష్ట్ర సచివాలయాల కో–ఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి అయ్యపరాజుగూడెం గ్రామానికి చెందిన అన్నపనేని శాంతరావును లింగపాలెం మండల సచివాలయాల కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాంతరావు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఎలీజాకు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వాహనాల వేలం

లింగపాలెం : ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో నాటుసారా, లిక్కర్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటర్ సైకిళ్లను ధర్మాజీగూడెం ఎస్సై చెన్నారావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం నిర్వహించారు. ఏలూరు ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు, చింతలపూడి సీఐ మల్లేశ్వరరావు, ఎస్సై పి.చెన్నారావు, ఏఎస్సై రాంబాబు, లింగపాలెం రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఆర్.మాణిక్యాలరావు వేలం నిర్వహించారు. 18 మోటర్ సైకిళ్లు, ఒక ట్రాక్టర్‌ను రూ.2,98,402 నగదుకు వేలం నిర్వహించామని, ఈ వేలంలో 40 మంది పాటదారులు పాల్గొన్నారని ఎస్సై చెప్పారు.

సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- పుట్లగట్లగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



పుట్లగట్లగూడెంలో ఎమ్మెల్యే ఎలీజాకు హారతులు పడుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పుట్లగట్లగూడెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బ్రోచర్లను అందజేశారు. తొలుత ఎమ్మెల్యేకి హారతులు ఇచ్చి గ్రామంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా లబ్ధి చేకూరిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడిన నిరుపేదలు ప్రస్తుత ప్రభుత్వంలో పథకాలు అందడంతో ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పరిపాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ తెచ్చుకోవాలన్నా, పింఛన్లు తీసుకోవాలన్నా దూరంగా ఉన్న కార్యాలయాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం ఇంటి వద్దకే రేషన్, పింఛన్లు అందించే విధానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని చూసిన ప్రజలంతా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ వామిశెట్టి పావని, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ నాయకులు బడే సత్యనారాయణ, గురజాల పార్థసారధి, మల్నీడి బాబి, గంజి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి అభివృద్ధికి చర్యలు



మినీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి కావలసిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్, నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం నగర పంచాయతీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. నగర పంచాయతీలో అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్ స్థలాల ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి యజమానులతో సమావేశం నిర్వహించాలని చెప్పారు. మినీ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రజల కోరిక మేరకు పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి స్థలం సేకరించాలని అధికారులను ఆదేశించారు. వేగి లింగేశ్వరస్వామి చెరువు కట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఎకరం స్థలం సేకరించి ఇస్తే పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పార్కు నిర్మాణానికి కలెక్టర్ రూ.కోటి కేటాయిస్తారని తెలిపారు. ఆయన వెంట కమిషనర్ ఎస్.రాంబాబు, తహసీల్దార్ కృష్ణజ్యోతి ఉన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్‌లే మార్గం

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లు చక్కటి మార్గమని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ సూచించారు. స్థానిక కోర్టు వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో పారా లీగల్ వాలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు జాతీయ లోక్ అదాలత్‌పై ప్రచారం నిర్వహిస్తున్నారని చెప్పారు. చిన్న, చిన్న తగాదాలను రాజీ చేసుకుని కక్షలకు దూరంగా ఉండాలని కోరారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు తెలుగువారికి అవమానకరం



కొయ్యలగూడెం జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి

కొయ్యలగూడెం : హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలు తెలుగు వారిని అవమానించడమేనని కొయ్యలగూడెం జెడ్పీటీసీ, జిల్లా విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆమె మాట్లాడారు. తెలుగువారు గర్వించదగిన నటులు ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావులను కించపరిచే విధంగా మాట్లాడడం బాలకృష్ణ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. ఎన్టీఆర్ అభిమానులు సైతం బాలకృష్ణ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారని పేర్కొన్నారు. ఎస్వీ రంగారావు బంధువు, టీడీపీ ఏలూరు నేత బడేటి చంటి స్పందించి బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించాలని శ్రీలక్ష్మి డిమాండ్ చేశారు.